సాక్షి ప్రకాశం

గురువారం । 24 । ఆగస్టు । 2023



ఒంగోలుకు పుష్కలంగా తాగునీరు

ఒంగోలు ఎస్ఎస్ ట్యాంకులకు నీటి సరఫరా చేసేందుకు మద్దిపాడు మండలం అన్నంగి వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌పై నిర్మించిన పంప్‌హౌస్‌ను ప్రారంభించారు.

- IIలో..



యువతి ప్రాణం తీసిన చున్నీ

ద్విచక్ర వాహనం చక్రంలో యువతి చున్నీ చిక్కుకుని మృతిచెందిన ఘటన తాళ్లూరు మండలం తూర్పుగంగవరం సమీపంలో జరిగింది.

- IIలో..

గరిష్టం/కనిష్టం
37/29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

దేశం గర్వించదగిన రోజు

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



ఒంగోలు: ఇస్రో చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతం కావడం భారతదేశం గర్వించదగిన రోజని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై బుధవారం విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండింగ్ కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. శ్రీహరికోటలో ఉన్న ఇస్రో కేంద్రం నుంచి ప్రయోగించడం ఆంధ్రులకు గర్వకారణం అన్నారు. ఈ విజయంతో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా భారత్ నిలుస్తుందన్నారు. మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రపంచ దేశాలలో భారత్ కీర్తి ప్రతిష్టలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



చంద్రయాన్ -3 పై మంత్రి సురేష్

త్రిపురాంతకం: ప్రపంచ దేశాల్లో భారత కీర్తి ప్రతిష్టలను చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతంతో ఇనుమడింపజేశారని, ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలకు ఆయన ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈరోజు చందమామ దక్షిణ ధృవంపై అడుగుపెట్టిన మన శాస్త్రవేత్తలు ప్రపంచ దేశాల్లో మరెవ్వరికీ దక్కని ఖ్యాతిని గడించారని అన్నారు. ఇస్రో మరెన్నో ప్రయోగాలు విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

స్వశక్తితో ఎదిగేలా..

- రూ.35 లక్షల బ్యాంకు రుణంతో బిస్కెట్ ఫ్యాక్టరీ పెట్టిన డ్వాక్రా మహిళ
- జిల్లాలో తొలిసారి ఏర్పాటు



తయారైన బిస్కెట్‌లను చూపిస్తున్న పీడీ రవికుమార్


సింగరాయకొండ: ఔత్సాహిక మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. స్వయం సహాయక సంఘ మహిళలు స్వశక్తితో ఎదిగేలా వారికి ఎటువంటి ష్యూరిటీలు లేకుండా రుణాలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సింగరాయకొండకు చెందిన రవి పద్మాదాలి డ్వాక్రా గ్రూపు సభ్యురాలు. 13 ఏళ్ల నుంచి సమీర గ్రూపు సభ్యురాలిగా ఉంది. పీఎంఈజీపీ పథకం కింద రుణానికి దరఖాస్తు చేసుకోవడంతో కెనరా బ్యాంకు ఆర్థిక సహాయంతో రూ.35 లక్షల రుణం మంజూరైంది. ఈ రుణంతో సొంతంగా సింగరాయకొండలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆమె 'దివ్య బిస్కెట్ ఫ్యాక్టరీ'ని ఏర్పాటు చేసింది. ఈ ఫ్యాక్టరీని డీఆర్‌డీఏ పీడీ రవికుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు రూపొందించి అమలు చేస్తున్నారని కొనియాడారు. బ్యాంకు లోన్ తీసుకోవాలంటే ష్యూరిటీ తప్పనిసరిగా చూపించాలని, అదే డ్వాక్రా గ్రూపు సభ్యురాలైతే లక్షలాది రూపాయల రుణంగా తీసుకున్నా ష్యూరిటీ చూపించాల్సిన అవసరం లేదని, ఈ అవకాశం కేవలం డ్వాక్రా సభ్యులకు మాత్రమే ఉందన్నారు. ఇప్పటి వరకు రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చామని, కానీ మొట్టమొదటిసారిగా రూ.35 లక్షలతో బిస్కెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం జిల్లాలోనే మొదటిదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ అబ్దుల్ రహీమ్, ఎంపీడీవో షేక్ జమీఉల్లా, డీపీఎంలు డేవిడ్, సుబ్బారావు, ఏపీఎం డీ జయరాజ్, కెనరా బ్యాంకు మేనేజర్ బీ విజయభాస్కర్, పాల్గొన్నారు.



కనిగిరిలో జాతీయ పతాకాలతో ఎంహెచ్ఆర్ స్కూల్ విద్యార్థినుల ర్యాలీ



చంద్రయాన్-3 ఆకారంలో కంభం వాసవీ విద్యానికేతన్ విద్యార్థుల ప్రదర్శన



చంద్రయాన్-3 చంద్రునిపై ల్యాండ్ అవుతున్న దృశ్యం



ఒంగోలు నవోదయలో విద్యార్థుల హర్షాతిరేకాలు



చంద్రయాన్ ఆకారంలో కూర్చున్న మార్కాపురంలోని ఓంసాయి వికాస్ విద్యానికేతన్ విద్యార్థులు



ఒంగోలు నవోదయ స్కూల్లో జాతీయ పతాకాలతో విద్యార్థుల కేరింతలు

ఇస్రో.. జేజేలు

నెలరాజుపై దిగ్విజయంగా విక్రమ్ ల్యాండర్ అడుగుపెట్టి వైజ్ఞానిక సత్తాచాటడంతో జిల్లా వాసులు మురిసిపోయారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచే టీవీల ముందు చంద్రయాన్-3 గమనాన్ని ఆసక్తిగా వీక్షించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో టీవీలు, పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. సరిగ్గా 6.04 నిమిషాలకు ల్యాండర్ చందమామపై కాలుమోపిన క్షణాలను ఉద్విగ్నంగా చూశారు. మిషన్ విజయవంతం అయిందని ఇస్రో ప్రకటించడంతో నంబరాలు చేసుకున్నారు. నృత్యాలు చేశారు. జాతీయజెండాను చేతపట్టి జయహో భారత్ అంటూ నినదించారు. ఈ ప్రయోగం విజయవంతం కావాలంటూ విద్యార్థులు చంద్రయాన్ ఆకారంలో కూర్చుని ఆల్‌దబెస్ట్ చెప్పారు. చంద్రయాన్ 3 సక్సెస్ కావడంపై ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఏ దేశం కాలుమోపని చంద్రుని దక్షిణ ధృవంపై చంద్రయాన్ 3 దిగడం ద్వారా భారతదేశ ఖ్యాతి విశ్వవ్యాపితమైందన్నారు. భారత్ శాస్త్ర సాంకేతిక రంగంలో అపూర్వమైన విజయం అని పేర్కొంటూ ఇందుకు కారకులైన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జీవన్ జ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులు



గిద్దలూరులో చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను తిలకిస్తున్న జీవన్ జ్యోతి డిగ్రీ కళాశాల విద్యార్థులు



ఒంగోలులోని క్విస్ కాలేజీలో చంద్రయాన్-3 ప్రయోగాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



ఒంగోలులో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం



సొంత నిధులతో జీజీహెచ్‌కి అందజేసిన అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి తదితరులు



రిమ్స్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన క్యాన్సర్ కనుగొనే మిషన్‌ను ప్రారంభిస్తున్న బాలినేని

- జీజీహెచ్, మెడికల్ కాలేజి అభివృద్ధికి కృషి చేస్తా
- మెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తాం
- త్వరలో ఆరోగ్యశాఖ మంత్రితో కలిసి సమావేశం ఏర్పాటు చేస్తాం
- జీజీహెచ్‌లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ప్రభుత్వ పరంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆ మేరకు జిల్లా కేంద్రంలో ఉన్న సర్వజన ఆస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో బాలినేని పాల్గొన్నారు. బాలినేని దంపతులు సొంత నిధులతో జీజీహెచ్‌కు అందచేసిన అంబులెన్స్‌ను పూజలు నిర్వహించి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రిమ్స్‌లో సత్యసాయి ట్రస్ట్ ఉచిత అన్నదాన కార్యక్రమం క్యాంటిన్‌ను ప్రారంభించారు. రాత్రి వేళల్లో కూడా అల్పాహారం, భోజనం ఏర్పాటు చేసి అందజేయాలని, అందుకు అవసరమైతే తాను తన మిత్రులు కలిసి సహాయం చేస్తామన్నారు. మెడికల్ కాలేజీలో క్యాన్సర్ డిటెక్ట్ పరికరాన్ని బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ రూ.26 లక్షలతో ప్రభుత్వం ఈ పరికరం అందజేసిందన్నారు. క్యాన్సర్ ఆస్పత్రిలో మాత్రమే ఉండే ఈ పరికరం ఇప్పుడు ఒంగోలు వైద్య కళాశాలలో అందుబాటులో ఉందన్నారు. అనంతరం మెడికల్ కాలేజీలో అధికారులతో కలిసి మెడికల్ విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలను తెలుసుకుని కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. వైద్య విద్యార్థుల హాస్టళ్లలో బాయ్స్ హాస్టల్‌లో ఆయన తండ్రి పేరు, బాలికల హాస్టల్‌లో తల్లి పేరుతో ఆర్‌ఓ ప్లాంట్‌లు సొంత నిధులతో ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా కాలేజీలో మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. విద్యార్థులు అడిగిన మేరకు క్రీడా మైదానం కలెక్టర్‌తో మాట్లాడి కేటాయిస్తామన్నారు. సెక్యూరిటీ పరంగా కూడా అక్కడికక్కడే విద్యార్థులు తెలిపిన సమస్యలను పరిష్కరించారు. విద్యార్థులు, ఇతర సిబ్బంది తెలిపిన సమస్యలు సావధానంగా విన్న బాలినేని అన్నీ సమస్యల పరిష్కారం కోసం వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని త్వరలో తీసుకువచ్చి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. జీజీహెచ్, మెడికల్ కాలేజీకి సంబంధించి ఏ సమస్యలున్నా నేరుగా తనతో కానీ స్థానిక కార్పొరేటర్‌తో కానీ తెలిపి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. వైద్య విద్యార్థులు, ప్రిన్సిపాల్ ఇతర సిబ్బంది బాలినేని గజమాలతో సత్కరించారు. దీనిలో జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, సీఎస్ ఆర్ఎంఓ చైతన్యవర్మ, ఓఎంసీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ బాలాజి నాయక్, వైస్ ప్రిన్సిపాల్ నారాయణరావు, డాక్టర్ తిరుమలరావు, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ మాధురి, సిటీ కన్వీనర్ కటారి శంకర్, కార్పొరేటర్‌లు ఈదర చిన్నారి, నాగరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, తాళ్లపాలెం శ్రీను, రాచమల్లు బ్రహ్మారెడ్డి, ఢాకా హనుమారెడ్డి, పటాపంజుల శ్రీను, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రకేసరి ఆశయాలు స్ఫూర్తిగా తీసుకోవాలి



ప్రకాశం పంతులు విగ్రహానికి నివాళులర్పిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆదిమూలపు సురేష్, బూచేపల్లి వెంకాయమ్మ, పోతుల సునీత, వైఎం ప్రసాదరెడ్డి, సింగరాజు మీనాకుమారి

- ఆయన నడయాడిన గడ్డపై ఉండటం గర్వకారణం
- మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే బాలినేని
- ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా పలువురు నివాళులు

ఒంగోలు అర్బన్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రాభివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీరితో పాటు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఇన్‌చార్జ్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ఒడా చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ ప్రసాదరెడ్డి ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్‌లో ప్రకాశం పంతులు జీవిత చరిత్రకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను అతిథులు తిలకించారు. అనంతరం కుటుంబ సభ్యులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులను సత్కరించి ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ధైర్యానికి, త్యాగానికి నిలువెత్తు నిదర్శనం టంగుటూరి ప్రకాశంపంతులని కొనియాడారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రుల కీర్తిని ఇనుమడింపజేసిన మహోన్నత వ్యక్తి అని కీర్తించారు. ఆయన పేరుతో జిల్లాలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ఈ ఏడాది చివరికి నీళ్ల ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకాశంపంతులు వంటి ధైర్యశాలి పుట్టి నడయాడిన గడ్డపై మనం ఉండటం గర్వకారణమన్నారు. ఆయన పేరుతో ఏర్పాటైన జిల్లాను మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. స్థానిక లాయర్‌పేటలో ప్రకాశం పంతులు కాంస్య విగ్రహం ఉన్న రోడ్డుకు ఆయన పేరుతో స్వాగత మార్గం ఏర్పాటు చేస్తున్న పనులు రెండు నెలల్లో పూర్తవుతాయని తెలిపారు. నేటి యువత ఆంధ్రకేసరిని ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ పేదరికం అడ్డుగా భావించకుండా ఉన్నత విద్యలు చదువుకుని ప్రజా సేవకు అంకితం అయిన ఆదర్శ ప్రాయుడు ప్రకాశం పంతులని కొనియాడారు. ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ ఆంధ్రకేసరి స్ఫూర్తితో పేదరికాన్ని నిర్మూలించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ అనేక పథకాలు ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు.

ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ భావితరాలకు ప్రకాశంపంతులు చరిత్రను తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఆయన చూపి బాటలో జిల్లాను అభివృద్ధి చేసేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి ఆర్ శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, కార్పొరేటర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

అనంతరం ఉప్పు సత్యాగ్రహం నిర్వహించిన దేవరంపాడు, ప్రకాశంపంతులు జన్మించిన వినోదరాయునిపాలెంలో ఆంధ్రకేసరి జయంతి వేడుకలు నిర్వహించారు. దీనిలో ఇన్‌చార్జ్ కలెక్టర్ కె శ్రీనివాసులు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. 12 స్వయం సహాయక సంఘాలకు రూ.49,50,000 ఉన్నతి, బ్యాంకు లింకేజి, సీఐఎఫ్ రుణాలను అందజేశారు.

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న సీఎం

- త్రిపురాంతకం మండలం విశ్వనాథపురంలో గడప గడపకు మన ప్రభుత్వం
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ప్రభుత్వ పథకాల లబ్ధి కరపత్రాన్ని అందజేస్తున్న పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతుగా నిలవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం విశ్వనాథపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రగతి రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మంచి పాలన అందిస్తున్నందున అందరం మద్దతుగా నిలిచి రానున్న ఎన్నికలలో తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలన్నారు. తెలుగుదేశం గతంలో జన్మభూమి కమిటీలతో ఆ పార్టీవారి కోసం పనిచేసిందన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని చెప్పారు. పార్టీలకతీతంగా సంక్షేమాభివృద్ధికి అందరం మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి, డీఈ సుబ్బారెడ్డి, ఏఈలు హనుమాన్ బాబు, సురేష్, శ్రీనివాస్, ఏఓ నీరజ, ప్రభుత్వ వైద్యాధికారి లక్ష్మీదేవి, ఏపీఓ సుజాత, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, గ్రామసర్పంచ్ మాధవీలత రంగబాబు, ఎంపీటీసీ మునలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చిన్నత్రిపురరెడ్డి, సుబ్రహ్మణ్యం, రాయల సుబ్బారావు, కోట సుబ్బారెడ్డి, నాసర్‌వలి తదితరులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్టు ఫీజు చెల్లించాలి

ఒంగోలు: సెప్టెంబర్‌లో నిర్వహించనున్న ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్టుకు హాజరుకాదలచుకున్న జిల్లాలోని వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఈ నెల 31వ తేదీలోగా రూ.200 పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.60 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 8వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సెప్టెంబర్ 9వ తేదీ లోగా సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

● మరో నలుగురికి గాయాలు


ప్రమాదంలో మృతి చెందిన హనుమయ్య

పెద్దదోర్నాల: వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురం గండిచెరువు వద్ద చోటుచేసుకుంది. ఈ సంఘటనలో భ్రమరాంబ చెంచు కాలనీకి చెందిన కుడుముల హనుమయ్య(20) మృతి చెందగా అదే వాహనంపై ప్రయాణిస్తున్న భూమని అంకన్న, భూమని వీరన్న, దాసరి అంకన్న భూమని పోలయ్య గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సిబ్బంది హుటాహుటిన పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం భూమని పోలయ్య, భూమని అంకన్నను మార్కాపురం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై అంకమ్మరావు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

కంభం: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం కంభం పట్టణంలోని దాల్‌సాబ్ వీధిలో చోటుచేసుకుంది. బేల్దారి పని చేసుకుంటూ జీవనం గడిపే ఖాదర్‌వలిబేగ్(35) కుటుంబ కలహాల కారణంగా మద్యానికి బానిసై తరుచూ కుటుంబ సభ్యులతో ఘర్షణపడేవాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతిచెందిన బాలుడి ఆచూకీ తెలపండి

● మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

యర్రగొండపాలెం: అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన బాలుడి ఆచూకీ తెలిపి పోలీసులకు సహకరించాలని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 16వ తేదీ స్థానిక హైవే రెస్టుహౌస్ సమీపంలో పొలాలకు వెళ్లే దారిలో బాలుడి మృతదేహం దొరికిందని డీఎస్పీ తెలిపారు. 6 సంవత్సరాల్లోపు వయసున్న బాలుడు మూడు రోజుల క్రితం మరణించి ఉంటాడని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు అక్కడ పడేసి వెళ్లారని వివరించారు. బాలుడి ఆచూకీ తెలుసుకునేందుకు టీంలుగా ఏర్పడి పోలీసులు గాలిస్తున్నారన్నారు. ఈ విషయం గురించి రెండు తెలుగు రాష్ట్రాల పోలీసు అధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు. 3.6 అడుగుల ఎత్తున్న ఆ బాలుడు గుండ్రటి మొహం కలిగి నీలిరంగు టీషర్ట్, మ్యాచింగ్ డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు మార్కాపురం డీఎస్పీ, యర్రగొండపాలెం సీఐ, ఎస్సై సెల్ నంబర్లు 9121102180, 9121102192, 9121102193కు, డయల్ 100కు సమాచారం అందించాలని, అటువంటివారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. యర్రగొండపాలెం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దీనివలన నేరాలు జరగకుండా అరికట్టగలుగుతారని ఆయన అన్నారు. సమావేశంలో సీఐ కె.మారుతీకృష్ణ, ఎస్సై జి.కోటయ్య పాల్గొన్నారు.

ఒంగోలుకు పుష్కలంగా తాగునీరు

● పంప్ హౌస్‌ను ప్రారంభించిన మంత్రి ఆదిమూలపు సురేష్
● పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
● గుండ్లకమ్మ వద్ద పంప్ హౌస్‌తోపాటు ఒంగోలు వరకు పైప్‌లైన్
● అమృత్ పథకం కింద రూ.123 కోట్ల నిధులతో పనులు పూర్తి
● రూ.300 కోట్లతో తాగునీటి పథకానికి సెప్టెంబర్‌లో సీఎం శంకుస్థాపన
● ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వెల్లడి


వెంగముక్కలపాలెం వద్ద శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి సురేష్, బాలినేని తదితరులు

ఒంగోలు సబర్బన్/మద్దిపాడు: ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసేందుకు మద్దిపాడు మండలంలోని అన్నంగి గ్రామం కొండ సమీపంలో గుండ్లకమ్మ రిజర్వాయర్‌పై అమృత్ పథకం కింద రూ.123 కోట్ల వ్యయంతో నిర్మించిన పంప్ హౌస్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం ప్రారంభించారు. పథకాన్ని ప్రారంభించడానికి వచ్చిన ప్రజాప్రతినిధులు, నాయకులకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ఆదిమూలపు సురేష్ రిబ్బన్ కత్తిరించి పంప్ హౌస్ మోటారును ప్రారంభించారు. అనంతరం బూచేపల్లి వెంకాయమ్మతో రెండో మోటర్‌ను బాలినేని ఆన్ చేయించారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనులు ప్రారంభించినప్పటికీ సక్రమంగా నిధులు విడుదల చేయకపోవడం, వచ్చిన నిధులను స్వాహా చేయడంతో పనులు నత్తనడకన సాగాయని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి


పంప్ హౌస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్‌తో మాజీ మంత్రి బాలినేని, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

వచ్చిన తర్వాత రివర్స్ టెండరింగ్ ద్వారా పారదర్శకంగా పనులు త్వరితగతిన పూర్తి చేశామన్నారు. దీని ద్వారా ఒంగోలు ప్రజలకు మంచినీటి సౌకర్యం మెరుగవుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఒంగోలు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా నగర ప్రజల అవసరాలు తీర్చే విధంగా రూ.300 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పథకాన్ని వచ్చే నెలలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. వచ్చే ఆరునెలల్లో ఈ పనులు పూర్తి చేసి నగవాసులను రోజూ నీళ్లు ఇస్తామన్నారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రజలందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పార్టీ కన్వీనర్ మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మల్లవరం సర్పంచ్ నారా సుబ్బారెడ్డి, అన్నంగి సర్పంచ్ పల్లపాటి లోకేశ్వరి అవినాష్, ఎంపీటీసీ రాయపాటి వెంకట సుజాత రమేష్, సన్నపురెడ్డి రమణమ్మ, గుడ్డపాతల రవి, మున్సిపల్ శాఖ ఉద్యోగులు సిబ్బంది పలువురు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని వెంగముక్కలపాలెం సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ సమీపంలో శిలాఫలకాన్ని మంత్రి సురేష్, ఎమ్మెల్యే బాలినేని తదితరులు ఆవిష్కరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒడా చైర్మన్ శింగరాజు మీనాకుమారి వెంకట్రావు, కఠారి శంకర్, ఒంగోలు నగర కార్పొరేటర్లు ఈదర సురేష్, చింతపల్లి గోపి, యనమల నాగరాజు, తాడి కృష్ణలత, ఎందేటి పద్మావతి రంగారావు, మధు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, తూము పద్మ, సాధు విజయలక్ష్మి, ఎంఈ కె.మాల్యాద్రి, ఏసీపీ కేవీ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్‌ఈ అబూతలీం, ఈఈ నాగార్జునరెడ్డి, ఏఈలు పాల్గొన్నారు.


మద్దిపాడు మండలం అన్నంగి వద్ద ప్రారంభమైన పంప్‌హౌస్

రైతులకు మెరుగైన విద్యుత్

● అందుబాటులో 1500 ట్రాన్స్‌ఫార్మర్లు
● 10 వేల విద్యుత్ స్తంభాలు సిద్ధం
● ఆర్‌డీఎస్ పథకం కింద రూ.840 కోట్లు
● విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ వెల్లడి
● కొన్ని పత్రికల్లో వస్తున్న అబద్ధపు కథనాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి



మార్కాపురం: రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించామని విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో కొన్ని పత్రికల్లో విద్యుత్ శాఖపై అబద్ధపు కథనాలు వస్తున్నాయని, గతంలో ఎప్పుడో జరిగినవి ఇప్పుడు జరిగినట్లుగా అభూత కల్పనలు రాస్తున్నారని, వాటిని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం మార్కాపురం డివిజన్ విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్ఈ మాట్లాడారు. డబ్బు కట్టిన వెంటనే రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 4 వేల కనెక్షన్లు ఇచ్చామని, పెండింగ్‌లో ఉన్న మరో 500 కనెక్షన్లను సెప్టెంబర్ 5వ తేదీలోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి మీటరు సర్వీసు కనెక్షన్‌కు అనుసంధానమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 1.25 లక్షల సర్వీసు మీటర్లు ఉన్నాయని, అందులో 13 వేల మీటర్లను ఈ నెలాఖరులోగా సర్వీస్ కనెక్షన్‌కు అనుసంధానం చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు.

సిబ్బందిపై చర్యలు

పనిచేసే చోటే నివాసం ఉండని సిబ్బంది హెచ్‌ఆర్‌ఏ అలవెన్స్ తొలగిస్తామని ఎస్ఈ హెచ్చరించారు. ప్రభుత్వ సిమ్‌లను 24 గంటలూ ఆన్‌లోనే ఉంచాలని, వినియోగదారులు ఫోన్ చేసి సమస్య చెబితే పరిష్కారం చూపాలని తెలిపారు. విద్యుత్ సమస్యలపై 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. మార్కాపురం డివిజన్‌లో రూ.7 కోట్ల విద్యుత్ బకాయిల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. బకాయిలు చెల్లించని వారి కనెక్షన్లు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆర్‌డీఎస్ పథకం కింద జిల్లాకు రూ.840 కోట్లు మంజూరయ్యాయని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ పథకం సర్వే చేపట్టామని, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకంలో భాగంగా ప్రతి గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఈఈ నాగేశ్వరరావు, ఏడీఈ షియానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి మేరకే పొగాకు పండించాలి

● టుబాకో బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి సూచన


మాట్లాడుతున్న మారెడ్డి సుబ్బారెడ్డి, పక్కన బోర్డు అధికారులు, రైతు నాయకులు

మద్దిపాడు: పొగాకు పంటను బోర్డు అనుమతి మేరకు పండిస్తేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని టుబాకో బోర్డు సభ్యుడు మారెడ్డి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన రైతుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2022–23లో మాండూస్ తుఫాన్ కారణంగా పొగాకు పంట దెబ్బతిందని, అయినా రైతులు వ్యయప్రయాసలకోర్చి పొగాకు సాగు చేశారన్నారు. అంతర్జాతీయంగా పొగాకు సాగు తగ్గిన నేపథ్యంలో ఈ ఏడాది విపరీతంగా డిమాండ్ ఏర్పడిందన్నారు. పొగాకు రైతులు ఈ ఏడాది లాభాలు గడించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుత ధరలు రాబోయే సీజన్‌లో ఉంటాయని భ్రమపడవద్దని, బోర్డు అనుమతించిన దానికంటే ఎక్కువ సాగు చేసి నష్టాలు కొనితెచ్చుకోవద్దని సూచించారు. అనధికారికంగా పొగాకు పండించే వారికి జరిమానా విధించడానికి బోర్డు సమాయత్తమైందని చెప్పారు. పండుగుల్లను కూడా బోర్డు ద్వారా అమ్మించడానికి బోర్డు ఈడీ ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు.

వేలం నిర్వహణాధికారి సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ.. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో 8.34 మిలియన్ కేజీలకు బోర్డు అనుమతి ఇవ్వగా 12.20 మిలియన్ కేజీల అమ్మకాలు జరిగాయన్నారు. రైతులకు ఇప్పటి వరకు 259 కోట్ల రూపాయలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది వేలంలో అత్యధికంగా 20 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. అనంతరం వేలంలో పాల్గొన్న బయ్యర్లు, హాజరైన మేనేజర్లను కార్యాలయ సిబ్బందిని, పొగాకు బోర్డు సభ్యులను రైతు సంఘ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సభ్యుడు పాద వరప్రసాద్, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, జీపీఐ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, నల్లరేగడి నేలల అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నరసింహారావు, ఒంగోలు 2 వేలం కేంద్రం రైతు నాయకుడు వడ్లెళ్ల ప్రసాద్, ఒంగోలు 2 వేలం కేంద్రం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ, విశ్రాంత రీజినల్ మేనేజర్ శ్రీనివాసులునాయుడు, వరహాల చౌదరి, మహేష్, గంగిరెడ్డి, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు లిస్టు పరిశీలన పూర్తి

– ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు


సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఓటరు లిస్టు పరిశీలన 98.48 శాతం పూర్తయిందని ఇన్‌చార్జ్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ప్రకాశంభవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఓటుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరినీ ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఓటు నమోదుపై కాలేజీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మార్కాపురం డిప్యూటీ కలెక్టర్ సేతు మాధవన్, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు విశ్వేశ్వరరావు, అజయ్ కుమార్, ఎలక్షన్ విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషాబేగ్, గుర్రం సత్యం, ఎస్‌కే రసూల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కనిగిరికి ఫోరెన్సిక్ వైద్య నిపుణుల రాక

● ఎమ్మెల్యే బుర్రా ఆదేశాలతో కనిగిరి ఆస్పత్రిలోనే బాలిక మృతదేహానికి పోస్టుమార్టం


కనిగిరి వైద్యశాలలో ఉన్న ఫోరెన్సిక్ వైద్య నిపుణులు

కనిగిరి రూరల్: స్థానిక ఎమ్మెల్యే, ఎన్జీ రంగా వర్సిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్‌యాదవ్ ఆదేశాలతో ఫోరెన్సిక్ వైద్య నిపుణులు బుధవారం కనిగిరి వచ్చి హత్యకు గురైన బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. హత్యకు గురైన బాలిక మైనర్ అయినందున పోస్టుమార్టం నిర్వహించేందుకు, కావాల్సిన నిపుణుల బృందం కనిగిరి ఆస్పత్రిలో లేదని స్థానిక ప్రభుత్వ వైద్యశాల అధికారులు తెలిపారు. ఆ మేరకు బాలిక మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు ఒంగోలు తీసుకెళ్లాలని వైద్యులు రిఫర్ చేశారు. అయితే, బాలిక బంధువులు, బీసీ నాయకులు కనిగిరిలోనే బాలిక మృతదేహానికి పోస్టుమార్టం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే బుర్రా.. మంగళవారం రాత్రి సమస్యను జిల్లా వైద్యాధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం వైద్య నిపుణుల (ఫోరెన్సిక్) బృందాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు పంపించాలని కోరారు. కలెక్టర్ సూచనల మేరకు బుధవారం ప్రొఫెసర్ సురేష్‌తో కూడిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం కనిగిరి వచ్చి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలోనే బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లి, బంధువులకు అప్పగించారు. దీంతో మృతురాలి బంధువులు, బీసీ నాయకులు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఖబడ్దార్ సూర్యప్రకాష్‌రెడ్డి

● స్థాయి మరచి మంత్రి, ఎమ్మెల్యేలపై ఆరోపణలు తగదు
● హెచ్చరించిన వైఎస్సార్ సీపీ నాయకులు


వైపాలెంలో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

యర్రగొండపాలెం: వైఎస్సార్ సీపీ పేరు చెప్పుకొంటూ, పార్టీలో నీ స్థానం ఏమిటో తెలియకుండానే మంత్రి, ఎమ్మెల్యేలపై ఆరోపణలు చేయడం సరి కాదని, నోరు అదుపులో పెట్టుకోవాలని పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డిని ఆ పార్టీ యర్రగొండపాలెం నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డిపై ప్రకాష్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఖండించారు. బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, పీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ మూడమంచు బాలగురవయ్య, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీలో నీ క్యాడర్ ఏంటని, వైఎస్సార్ సీపీ నాయకుడవని ఎలా చెప్పుకుంటున్నావని ప్రశ్నించారు. మైకు కనబడగానే నీ స్థాయిని మరిచి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న నీవు నాయకుడినని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పబ్లిసిటీ కోసం ఇతరులపై నిందలు వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మార్కాపురం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కుటుంబం రాజకీయంగా చేసిన సేవలు ప్రజలకు తెలుసని, మంత్రి సురేష్ రాజకీయ అరంగ్రేటం చేసిన నాటి నుంచి అవినీతి, అక్రమాలు అనే మాటకు తావులేదని, మచ్చలేని నాయకుడిగా పేరున్న ఆయనపై ఆరోపణలు చేయడం ఏమిటన్నారు. 2009 నుంచి మూడు పర్యాయాలు, రెండు నియోజకవర్గాల్లో గెలుపొంది హ్యాట్రిక్ నాయకుడిగా పేరుతెచ్చుకున్న మంత్రి సురేష్‌పై అవాకుచవాకులు పేలితే తీవ్ర పరిణామాలకు గురికావాల్సి వస్తుందని, ఖబడ్దార్ సూర్యప్రకాష్‌రెడ్డి అంటూ హెచ్చరించారు. ఎక్కడో దాక్కుని అనుకూలంగా ఉన్న మీడియాతో మాట్లాడటం కాదని, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోకి వస్తే ప్రజలే నీకు బుద్ధి చెబుతారన్నారు.

యువతి ప్రాణం తీసిన చున్నీ

● బైక్ చక్రంలో చిక్కుకున్న చున్నీ
● ఒక్కసారిగా రోడ్డుపై పడి తీవ్ర గాయాలు


మృతిచెందిన యాతం అంజలి

తాళ్లూరు (ముండ్లమూరు): ద్విచక్ర వాహనం చక్రంలో చున్నీపడి యువతి మృతిచెందిన సంఘటన తాళ్లూరు మండలంలోని తూర్పుగంగవరం సమీపంలో బుధవారం జరిగింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... యాతం శ్రీనివాసరెడ్డి, భార్య యాతం అంజలి (35) తూర్పుగంగవరంలో గీతాంజలి స్కూల్ నడుపుతున్నారు. ప్రతిరోజూ స్వగ్రామం నాగంబొట్లపాలెంలోని ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై తూర్పుగంగవరం వెళ్లి వస్తుంటారు. రోజులానే బుధవారం ఉదయం పిల్లలు సురక్షర, జానులతో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. నాగంబొట్లపాలెం – తూర్పుగంగవరం మధ్య అంజలి చున్నీ జారి చక్రంలో చిక్కుకుంది. దీంతో అంజలి రోడ్డుపై పడింది. గాయాలవడంతో ప్రైవేట్ వాహనంలో ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు భర్త శ్రీనివాసరెడ్డి తెలిపారు. మృతురాలికి భర్త శ్రీనివాసరెడ్డి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న హెడ్ కానిస్టేబుల్ ఎం.రమేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అంజలి (ఫైల్)

గానుగపెంటలో వజ్రాల వేట


బుడ్డపల్లికి చెందిన వ్యక్తికి దొరికిన వజ్రం లాంటి రాయి

తర్లుపాడు: మండలంలోని గానుగపెంట ఇలాఖా నల్లకొండ, చెన్నరాయునినరవ ప్రాంతాల్లో వజ్రాలు దొరుకుతున్నాయని పుకార్లు రావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వచ్చి తిండీతిప్పలు మాని గాలిస్తున్నారు. వారం రోజులుగా ఈ వేట కొనసాగిస్తున్నారు. బుడ్డపల్లికి చెందిన ఓ వ్యక్తికి ఆ ప్రాంతంలో వజ్రం దొరికిందని పుకార్లు షికార్లు చేయడంతో మహిళలు పెద్దఎత్తున ఆ ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు. ప్రతి రాయిని కదిలించి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అత్యంత విలువైన వజ్రాలు దొరికితే తమ జీవితాలు మారిపోతాయనే ఆశల పల్లకిలో ప్రజలు చేసే పనులు మాని వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. తలతలా మెరిసే ఏ రాయి కనిపించినా ఆశగా తడిమిచూస్తున్నారు. పశువుల కాపరులు మాత్రమే తిరిగే అటవీప్రాంతంలో జనాలు వజ్రాలను వేటాడుతుండటంతో ఈ ప్రాంతం వారం రోజులుగా జనసంచారంతో సందడిగా మారింది.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా సెప్టెంబర్ 5వ తేదీ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గురువులను నామినేట్ చేయాలని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులను జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు ఆదేశించారు. జిల్లాలో వివిధ ప్రభుత్వ రంగంలోని వివిధ కేటగిరీల పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు తమ వివరాలను మండల స్థాయి కమిటీకి అందజేయాలన్నారు. ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ వివరాలను ఉప విద్యాశాఖ అధికారి స్థాయి కమిటీలకు ఈనెల 28వ తేదీలోగా పంపుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఒక్కో కేటగిరీ నుంచి ఒక్కొక్క దరఖాస్తు ఎంపికచేసి సభ్యుల సంతకాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఈనెల 29వతేదీ లోగా పంపాలని డీఈవో వీఎస్ సుబ్బారావు ఆదేశించారు.

క్లుప్తంగా

అమర జవాన్లను స్మరించుకుందాం



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చీమకుర్తి: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్లను స్మరించుకుందామని పేర్నమిట్ట జిల్లాపరిషత్ హైస్కూలు ఎన్‌సీసీ ఆఫీసర్ బీ శ్రీనివాసరావు ఎన్‌సీసీ విద్యార్థులకు పిలుపునిచ్చారు. మేరీ మాటీ–మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలో నాభూమి–నాదేశం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దేశం కోసం త్యాగాలు చేసిన పౌరులు, అమర జవాన్ల సేవలను స్మరించుకుంటూ ఈ నెల 9 నుంచి 30 వరకు నిర్వహించే నాభూమి–నాదేశం కార్యక్రమం ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. బ్యానర్లను ప్రదర్శిస్తూ పేర్నమిట్ట గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు

ఒంగోలు: రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా రవాణాశాఖ అధికారులు బుధవారం ఆకస్మికంగా వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక వెంగముక్కలపాలెం రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న 40 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వాహనాలు సీజ్‌చేసి రవాణాశాఖ ఉప కమిషనర్ కార్యాలయానికి తరలించారు. వాహనానికి బీమాతో పాటు డ్రైవర్‌కు లైసెన్స్‌తో, వాహన పత్రాలను పరిశీలించారు. వాహనదారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బందికి శిక్షణ

ఒంగోలు రూరల్: ఒంగోలు వ్యవసాయ డివిజన్‌లోని ఒంగోలు, ఎస్.ఎన్.పాడు, టంగుటూరు, కొత్తపట్నం, చీమకుర్తి, నాగులుప్పలపాడు వ్యవసాయశాఖ అధికారులకు, ఆర్‌బీకే సిబ్బందికి, ఏఎస్‌వోలకు, ఏడీఏ రమేష్‌బాబు అధ్యక్షతన బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఒంగోలులోని ఏవో కార్యాలయ పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రణాళికశాఖ అధికారి వాసుదేవరావు పాల్గొని మాట్లాడారు. పంట కోత ప్రయోగాలు జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులకు, పర్యవేక్షణ అధికారులకు ముందుగా తెలిపి వారి సమక్షంలోనే పంట కోత ప్రయోగం చేపట్టాలన్నారు. ఇ–క్రాప్‌ను అతి జాగ్రత్తగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఒంగోలు ఏవో కిషోర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ ఆకస్మిక తనిఖీలు

ఒంగోలు: వెట్టిచాకిరి నిర్మూలనకై జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు ఒంగోలు ఉప కార్మికశాఖ కమిషనర్ ఎస్.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఈ నెల 22 నుంచి ఈ తనిఖీలు ప్రారంభించామన్నారు. జిల్లాలో రెండు టీములుగా ఏర్పడి వై.పాలెం, కనిగిరి, జరుగుమల్లి, త్రిపురాంతకం, కరవది, మద్దిపాడు, చీమకుర్తి ప్రాంతాల్లోని ఇటుకల బట్టీలలో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడటం జరిగిందన్నారు. వారికి ఎంతెంత వేతనాలు ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నామన్నారు. బట్టీ యాజమాన్యం కూలీలకు ముందుగా డబ్బులు అడ్వాన్స్‌గా ఇచ్చి బెదిరించి వారిని శ్రమ దోపిడీకి గురిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలను పనిలోకి తీసుకుంటే బాలకార్మికులుగా పేర్కొంటూ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికశాఖ, పోలీసుశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, చైల్డ్‌లైన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆంధ్రకేసరికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తదితరులు



లాయర్‌పేటలో టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒడా చైర్‌పర్సన్ మీనావెంకట్రావు



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఆంధ్రకేసరి స్ఫూర్తితో ముందుకు సాగుదాం

- ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని, మంత్రి ఆదిమూలపు
- ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

ఒంగోలు:

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ చైర్‌పర్సన్ సింగరాజు మీనావెంకట్రావు తదితరులు పాల్గొని ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలోని వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రకాశం పంతులు నడయాడిన ప్రకాశం జిల్లావాసులం కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు పయనించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్, రజక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి సుతారం శ్రీనివాసులు, సూర్యబలిజ, కృష్ణబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు దాసరి కరుణాకర్, తిర్లిక శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, మహిళా విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ బడుగు ఇందిర, జగనన్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వారా వీర్రాజు తదితరులు పాల్గొని ప్రకాశం పంతులు చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు.

లాయర్‌పేట రైతు బజార్ వద్ద పాల్గొన్న బాలినేని, ఆదిమూలపు...

ఒంగోలు మెట్రో: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని లాయర్‌పేట రైతు బజార్ వద్ద గల ఆయన విగ్రహానికి ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కార్పొరేటర్లు శాండిల్య, నీలంరాజు సరోజిని రాఘవ, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రకేసరి ఖ్యాతిని కొనియాడారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో...

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎస్పీ మలికాగర్గ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రకాశం పంతులు తెలుగు జాతికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన పోరాట జీవితాన్ని నేటి తరాలు స్ఫూర్తిగా తీసుకుని కులమతాలకతీతంగా దేశం కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైం) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఓ ఎం.సులోచన తదితరులు పాల్గొన్నారు.

దేవరంపాడులోని విజయ స్థూపం వద్ద...

ఒంగోలు రూరల్: మండలంలోని దేవరంపాడులో గల ఉప్పుసత్యాగ్రహ విజయ స్థూపం వద్ద ఆ గ్రామ సర్పంచ్ నన్నపనేని వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తొలుత విజయస్థూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విజయసూపంపై ఉన్న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రకాశం పంతులు నివసించిన ఉప్పుసత్యాగ్రహ కుటీరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో విశ్వేశ్వరరావు, జెడ్పీ సీఈవో జాలిరెడ్డి, ఎంపీపీ పి.మల్లికార్జునరెడ్డి, ఒంగోలు తహసీల్దార్ పి.మురళి, ఒంగోలు ఎంపీడీవో పి.అజిత, పీఆర్ ఏఈ శేషగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ వలి, ఏపీఎం గోపీనాథ్, ఏపీవో, కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కరవది పీహెచ్‌సీలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. జేసీ, ఉన్నతాధికారులు పండ్ల మొక్కలు నాటారు.

వినోదరాయునిపాలెంలో...

నాగులుప్పలపాడు: ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన మండలంలోని వినోదరాయునిపాలెంలో బుధవారం నిర్వహించిన వేడుకల్లో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదాల రత్నభారతి అశోక్, తదితరులు పాల్గొని ఆంధ్రకేసరి విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధనలో మహనీయుల సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కోలాటం ఆకర్షణగా నిలిచింది. ఝాన్సీ లక్ష్మీభాయి రూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంపీపీ, జెడ్పీటీసీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి యాదాల అశోక్, గ్రామ సర్పంచ్ ఘట్టమనేని అశోక్, తహల్దార్ సుజన్‌కుమార్, ఎంపీడీవో జయమణి, ఎంఈవోలు రవి, రమణయ్య, ఏపీఎం రవి, ఏపీవో రవిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా బుధవారం చీమకుర్తిలోని పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఎస్సై రామిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రకాశం పంతులు చేసిన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు పరాంకుశం శ్రీనివాసమూర్తి, ముప్పూరి చలమయ్య, అంబటి వీరారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. బధిరుల పాఠశాలలో అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘ నాయకులు బత్తుల మల్లికార్జునతో కలిసి ప్రకాశం పంతుల చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. శ్రీవిద్యానికేతన్ హైస్కూల్లో కరస్పాండెంట్ పీ రవీంద్ర ఆధ్వర్యంలో ప్రకాశం పంతులుకు నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వినోదరాయునిపాలెంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ రత్నభారతి అశోక్



దేవరంపాడులో సెల్యూట్ చేస్తున్న జేసీ శ్రీనివాసులు, అధికారులు



చీమకుర్తిలో టంగుటూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎస్సై రామిరెడ్డి, రోటరీ క్లబ్ సభ్యులు

విద్యార్థుల ఉన్నతికి వేదికగా ఉండాలి

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ప్రతి విద్యార్థిని తీర్చిదిద్దాలి
- సమాజం కోసం సర్వదాస్తిని త్యాగం చేసిన మహనీయుడు ఆంధ్రకేసరి మనందరికీ ఆదర్శం
- విశ్వవిద్యాలయ అభివృద్ధికి కట్టుబడి ఉంటాం
- ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నతికి ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వేదికగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, ఇతర సిబ్బందితో కలిసి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీదుగా ఏర్పాటైన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం జాతిగర్వించదగిన యూనివర్శిటీగా మారాలన్నారు. విద్యార్జన కోసం టంగుటూరి ప్రకాశం పంతులు ఎంతగా కష్టపడ్డారు, ఆ తర్వాత ఆయన ఏ స్థాయిలో ఆస్తిపరునిగా మారారు, చివరకు ఆ ఆస్తి మొత్తాన్ని స్వాతంత్ర్య సమర జ్వాల రగిల్చేందుకు ఎలా వ్యయం చేశారనేది ఆయన జీవిత చరిత్రను చదివితే అర్థమవుతుందన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు విశ్వవిద్యాలయం అభివృద్ధిలో తాము కూడా తప్పకుండా భాగస్వాములమవుతామన్నారు. ప్రకాశం పంతులు పేరిట ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో తమకంటూ ఒక ప్రత్యేక పేరు ఉండాలని కోరుకునేందుకు దాతలు ముందుకొస్తే అనతికాలంలోనే అభివృద్ధికి చిరునామాగా మారి ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆకాంక్షించారు. యూనివర్శిటీ వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి మాట్లాడుతూ పేర్నమిట్ట వద్ద 110 ఎకరాల స్థలంలో విశ్వవిద్యాలయానికి ప్రభుత్వం స్థలం కేటాయించినట్లు తెలిపారు. అందులోకి మూడు నుంచి 4 నెలల్లోనే పరిపాలనా భవనం, వీసీ చాంబర్‌తోపాటు విద్యార్థుల హాస్టల్స్ కూడా ఉండాలని ప్రణాళికలు కూడా సిద్ధం చేశామన్నారు. బ్రిటీష్‌వారిని సైతం గడగడలాడించిన ధీశాలి టంగుటూరి ప్రకాశం పంతులు పేరుమీద ఏర్పాటైన యూనివర్శిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరుతున్నామన్నారు. యూనివర్శిటీలో ప్రతి ఏటా ఆగస్టు 23వ తేదీ ప్రకాశం పంతులు జీవితంపై అధ్యయనం చేసిన ఒక గొప్ప వక్తను ఆహ్వానించి కార్యక్రమం జరపాలని, తద్వారా యూనివర్శిటీలో విద్యనభ్యసించే ప్రతి ఒక్కరికీ ప్రకాశం పంతులు జీవితం ఆదర్శంగా ఉండేలా శాశ్వత చర్యలు చేపట్టాలన్నారు. చాలా యూనివర్శిటీలు చాలా తక్కువ సౌకర్యాలతో ప్రారంభమయ్యాయని, అయితే ప్రకాశం పంతులు పేరుమీద ఏర్పాటైన యూనివర్శిటీ కావడంతో వేగంగా అభివృద్ధి చెందాలనేదే తన ఆకాంక్షని అన్నారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు, డీన్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపట్నంను మోడల్ మండలంగా తీర్చిదిద్దాలి

- రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి చంద్రశేఖర్



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న చంద్రశేఖర్

కొత్తపట్నం: ప్రకృతి వ్యవసాయంలో జిల్లాలోనే కొత్తపట్నం మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దాలని గుంటూరు రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ కార్యాలయం నుంచి వచ్చిన రైతు సాధికార సంస్థ రాష్ట్ర ప్రతినిధి టీఎల్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం వెలుగు ఆఫీస్ భవనంలో బుధవారం రెండోరోజు గ్రామ సంఘ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సాధికార సంస్థ ఉద్దేశం, నిర్మాణం, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర, గ్రామ సంఘం పాత్ర గురించి వివరించారు. అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యవసాయంలో పెట్టుబడుల గురించి, తక్కువ పెట్టుబడితో ఎలా సాగు చేయాలనే అంశం గురించి వివరించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి మాట్లాడుతూ మోడల్ మండలంలో రాబోయే రోజుల్లో జరిగే మార్పులపై శిక్షణ ఇచ్చారు. ప్రతి గ్రామ సంఘం పరిధిలో ప్రకృతి వ్యవసాయం ఇన్పుట్‌షాపు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం రజియా సుల్తాన్‌బేగం, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వికాస్‌రెడ్డి, నరసింహులు, రెడ్డప్ప, వీరమ్మ, వెంకటేశ్వరరెడ్డి, గ్రామ సంఘ నాయకులు, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

నేడు నాగులుప్పలపాడు మండల సర్వసభ్య సమావేశం

నాగులుప్పలపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం ఉదయం 10 గంటలకు నాగులుప్పలపాడు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయమణి తెలిపారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పీఏసీఎస్ అధ్యక్షులతో పాటు మండలంలోని వివిధ శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని తెలిపారు.

ఒంగోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో క్యూఆర్ కోడ్ హుండీ

ఒంగోలు మెట్రో: స్థానిక చెన్నకేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానానికి యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ అరుణ సేవిత బుధవారం క్యూఆర్ కోడ్ హుండీ అందించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి రజిని ఆధ్వర్యంలో ఆలయానికి హుండీ సమర్పించారు. ఈ సందర్భంగా అరుణ సేవిత మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి భక్తులు కానుకలు సమర్పిస్తే నేరుగా ఆలయ ఖాతాలోకి జమవుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ సిబ్బందికి దేవస్థాన కార్యనిర్వహణాధికారి రజిని ధన్యవాదాలు తెలిపారు. ముందుగా దేవస్థానంలో అరుణ సేవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ అధికారి ఉమామహేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



ఆలయానికి హుండీ అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ అరుణ సేవిత

విజయోత్సాహం



ఒంగోలు రైజ్ కాలేజీలో హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో దేశభక్తిని చాటుతున్న విద్యార్థులు

- చంద్రయాన్–3 విజయవంతంపై వెల్లివిరిసిన ఆనందం

ఒంగోలు/చీమకుర్తి: చంద్రయాన్–3 విజయవంతం కావడంతో బుధవారం ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు. పలు కాలేజీల్లో విద్యార్థులు కేరింతలు కొట్టి సంబరాలు చేసుకున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి అధ్యక్షతన ఆ పార్టీ నాయకులు ఒంగోలులో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా స్థానిక లాయర్‌పేటలోని చిట్టి ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం, రైజ్ కాలేజీ, క్విస్ కాలేజీ, నవోదయ విద్యాలయాల్లో విద్యార్థులు జయహో భారత్ అంటూ నినదించారు. సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలు చేతబట్టి దేశభక్తిని చాటారు.

టిడ్కో డబ్బు చెల్లించాలి

ఒంగోలు టౌన్: టిడ్కో ఇళ్లు రద్దయిన లబ్ధిదారులకు వెంటనే డబ్బు చెల్లించాలని సీపీఎం నగర కార్యదర్శి జి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ 5 సంవత్సరాల క్రితం టిడ్కో ఇళ్ల కోసం డబ్బు కట్టించుకుందని, వారిలో ఇళ్లు రద్దయిన లబ్ధిదారులకు చెందిన రూ.17 కోట్లు నగరపాలక సంస్థ వద్ద ఉన్నాయని తెలిపారు.

కలెక్టరేట్ వద్ద పెన్షనర్ల సత్యాగ్రహ దీక్ష

ఒంగోలు టౌన్: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. యూనియన్ నాయకుడు జి.శేషయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ఈ దీక్షను ఏవీ పుల్లారావు ప్రారంభించారు. ప్రతినెలా ఒకటో తేదీ పెన్షన్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఆర్టీసీ నాయకుడు అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లలిత ఆశ్రమంలో శ్రీకృష్ణ అవతారం ప్రవచనం

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలోని లలిత ఆశ్రమంలో లలితాదేవి 40వ జయంతి వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం చివరిరోజు ఉదయం అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీలలితా ధ్యానమండలి వారిచే లలితాహోమం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ప్రముఖ జ్యోతిష్య వాస్తు సిద్ధాంతి ఆధ్యాత్మిక ప్రవచకులు అగస్త్యరాజు శివ శ్రీకృష్ణ అవతారం ప్రవచనం, బమ్మెర పోతన రచించిన ఆంధ్ర మహాభాగవతం, శ్రీకృష్ణ జననం, శ్రీకృష్ణ బాలలీలలు పద్యాలాపన, తాత్పర్యములను శ్రోతలకు వివరించారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు శ్రీ జ్ఞానానంద సరస్వతి మాతాజీ అగస్త్యరాజు శివని సత్కరించారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయిన పిన్ని వెంకటరమణయ్య కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.58 వేల చెక్కును కె.పల్లెపాలెం సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు బుధవారం పంపిణీ చేశారు. పిన్ని వెంకటరమణయ్య అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. హాస్పిటల్లో కొంత కాలం చికిత్స పొంది ఇంటి వచ్చాక ఆరోగ్యం నయం కాకపోవడంతో వెంకటరమణయ్య మృతి చెందాడు. హాస్పిటల్ ఖర్చులను సీఎంఆర్‌ఎఫ్‌కు పంపగా, రూ.58 వేలు మంజూరయ్యాయి. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును బుధవారం మృతుడి భార్య పిన్ని తిరుపాలమ్మ, కుమారుడు పిన్ని రాఘవేంద్రరావుకు అందించారు. కష్టకాలంలో రూ.58 వేల చెక్కు ఇవ్వడంపై బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ఆనందరావు